ఎమ్మెల్సీ అభ్యర్థి ఎంపిక ఏకపక్షం

సీనియర్ మంత్రి ఫిర్యాదు • ఇన్‌చార్జి మంత్రిగా తనకు, స్థానిక ఎమ్మెల్యేలకు సమాచారం లేదని ఆవేదన

- పార్టీతో సంబంధంలేని వ్యక్తిని తీసుకొచ్చి తమ నెత్తిమీద పెడితే మోయలేమని స్పష్టీకరణ
- మంత్రిఫిర్యాదు నేపథ్యంలో సీఎంను గట్టిగా నిలదీసి, తలంటిన పార్టీ పెద్దలు
- ఆ అవమానంతో ఇద్దరు ఎంపీల మీద తీవ్ర అసహనం వ్యక్తం చేసిన ముఖ్యమంత్రి రేవంత్



హైదరాబాద్, ఫిబ్రవరి 7(నమస్తే తెలంగాణ): రాష్ట్రస్థాయిలో మంత్రుల ప్రవర్తన మీద ఆ పార్టీ ఎమ్మెల్యేలు నిసరనగళం ఎత్తినట్టుగానే, ఢిల్లీ అధిష్ఠానం వద్ద సీనియర్ మంత్రి ఒకరు ముఖ్యమంత్రిపై ధిక్కారస్వరం వినిపించినట్టు విశ్వసనీయ సమాచారం. పరిపాలనలో అనుభవ రాహిత్యంతో ముఖ్యమంత్రి తప్పటడుగులు వేస్తున్నారని, ఏకపక్ష ధోరణి నిర్ణయాలతో ప్రజల్లో వ్యతిరేకత పెరుగుతున్నదని, జెండాలు మోసిన కార్యకర్తలు పార్టీకి దూరమవుతున్నారని సదరు మంత్రి అధిష్ఠానానికి ఫిర్యాదు చేసినట్టు తెలిసింది. శుక్రవారం ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి, అధిష్ఠానం దూత కేసీ వేణుగోపాల్ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో విడివిడిగా సుదీర్ఘ చర్చలు జరిపారు. రాష్ట్రంలో పార్టీ అంతర్గత వ్యవహారాలు, ఎమ్మెల్యేల రహస్య భేటీ, పరిపాలనా తీరుతెన్నులు, సంక్షేమ పథకాల అమలు, కులగణన సర్వే, బీసీ జనాభా నివేదిక, ప్రతిపక్షాల మీద కేసులు, ప్రజల స్పందన తదితర అంశాలపై నేతల నుంచి విడివిడిగా సమాచారం తీసుకున్నట్టు తెలుస్తున్నది.

మా నెత్తి మీద కూర్చోపెడితే ఆ బరువు మోయలేం

ఒక సీనియర్ మంత్రితో కేసీ వేణుగోపాల్ మాట్లాడుతున్న సందర్భంలో కరీంనగర్-మెదక్-నిజామాబాద్-ఆదిలాబాద్ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి ఎంపిక అంశం ప్రస్తావనకు వచ్చినట్టు తెలిసింది. సదరు అభ్యర్థి ఎంపిక ఏకపక్ష నిర్ణయమని, అందులో ఒక జిల్లా ఇన్‌చార్జిగా ఉన్న తనకు కనీస సమాచారం లేదని ఆవేదన వ్యక్తంచేసినట్టు తెలిసింది. అదే స్థానం నుంచి ప్రస్తుతం ఎమ్మెల్సీగా ఉన్న పార్టీ సీనియర్ నేత జీవన్‌రెడ్డికి గానీ, పట్టభద్రుల నియోజకవర్గం పరిధిలోని ఎమ్మెల్యేలకు గానీ కనీసం ఒక్కమాట కూడా చెప్పకుండా రహస్య పద్ధతిలో అభ్యర్థి ఎంపిక జరిగిందని కేసీ వేణుగోపాల్‌కు ఫిర్యాదు చేసినట్టు తెలిసింది. తల్లిదండ్రుల ముక్కుపిండి ఫీజులు వసూలు చేసే విద్యా వ్యాపారిగా అతనికి పేరున్నదని, అటువంటి వ్యక్తిని తీసుకొచ్చి తమ మీద రద్దుతున్నారని ఆవేదన వ్యక్తంచేసినట్టు తెలిసింది. పార్టీతో సంబంధం లేని వ్యక్తిని తీసుకొచ్చి బలవంతంగా తమ నెత్తి మీద కూర్చోపెడితే ఆ బరువు తాము మోయలేమని, అతని అభ్యర్థిత్వాన్ని అంగీకరించేది లేదని సదరు సీనియర్ మంత్రి తెగేసి చెప్పినట్టుగా తెలిసింది.

పసిగట్టకుండా మీరేం చేస్తున్నరు

ఇద్దరు ఎంపీల మీద సీఎం గరంగరం

ఎమ్మెల్సీ అభ్యర్థి ఎంపిక విషయంలో సీనియర్ మంత్రి ఆవేదనను సానకూలంగా విన్న కేసీ వేణుగోపాల్ తరువాత సీఎంతో భేటీలో ప్రధానంగా ఈ అంశంపైనే మాట్లాడినట్టు తెలిసింది. ఎమ్మెల్సీ అభ్యర్థిని ఎంపిక చేసేటప్పుడు ఆయా జిల్లాల ఇన్‌చార్జి మంత్రులు, ఎమ్మెల్యేల అభిప్రాయం ఎందుకు తీసుకోలేదని ప్రశ్నించినట్టు సమాచారం. 'మీ మంత్రులు, ఎమ్మెల్యేలు అసంతృప్తితో ఉన్నారనే విషయాలు మీ వరకు వస్తున్నాయా? మధ్యలోనే ఆగిపోతున్నాయా?' అని అడిగినట్టు తెలిసింది. ఎమ్మెల్యేలు రహస్య భేటీ అయ్యేంత వరకు మీరు ఏంచేస్తున్నట్టు? తెలంగాణలో పాలనపై ఎప్పటికప్పుడు ఢిల్లీకి నివేదికలు వస్తూనే ఉన్నాయి. పాలన ఇలా ఉంటే పార్టీ బతకదు' అంటూ మందలించడంతో సీఎం తీవ్ర ఆందోళనకు గురైనట్టు తెలిసింది. సహనం కోల్పోయిన ఆయన, తన అధికారిక నివాసానికి వచ్చిన తరువాత తన వెంట ఉన్న ఇద్దరు ఎంపీల మీద తీవ్రస్థాయిలో విరుచుకుపడినట్టు సమాచారం. ఎవడెవడో వచ్చి అధిష్ఠానానికి రాంగ్ రిపోర్టులు ఇస్తుంటే మీరు ఏం చేస్తున్నారని మండిపడ్డట్టు తెలిసింది.

- అమ్మవారి ఆశీస్సులు అందరిపై ఉండాలి

మహంకాళి అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్ ఆకాంక్షించారు. రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండల కేంద్రంలోని రెడ్డి సేవా సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్మించిన మహంకాళి అమ్మవారి ఆలయంలో శుక్రవారం నిర్వహించిన హోమం, పూర్ణాహుతి కార్యక్రమానికి కేటీఆర్ హాజరయ్యారు. అనంతరం అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో రామన్నను సన్మానించి జ్ఞాపిక అందజేశారు. - గంభీరావుపేట



కేంద్ర మంత్రి పీయూష్ గోయల్‌కు వినతిపత్రం అందజేస్తున్న రాజ్యసభ సభ్యుడు ఆర్ కృష్ణయ్య, బీసీ నేతలు గుజ్జ కృష్ణ, నరేశ్ తదితరులు

బీసీలకు 2 లక్షల కోట్లు కేటాయించాలి

రాజ్యసభ సభ్యుడు, బీసీ నేత ఆర్ కృష్ణయ్య

కాచిగూడ, ఫిబ్రవరి 7: తక్షణమే పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు ఏర్పాటుచేసి బీసీలకు రూ.2 లక్షల కోట్లు కేటాయించాలని రాజ్యసభ సభ్యుడు, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్య కేంద్రాన్ని కోరారు. ఈ మేరకు ఢిల్లీలో కేంద్ర మంత్రి పీయూష్ గోయల్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. దేశవ్యాప్తంగా ఉన్న 75 కోట్ల మంది బీసీలకు కేంద్ర బడ్జెట్‌లో కేవలం రూ.2,500 కోట్లను కేటాయించి కేంద్రం తీవ్ర అన్యాయం చేసిందని మంత్రికి వివరించారు. కేంద్రంలో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వశాఖను ఏర్పాటు చేయాలని కోరారు. బీసీల సమస్యలను ప్రధాని మోదీ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా కృషి చేస్తానని మంత్రి పీయూష్ గోయల్ హామీ ఇచ్చినట్టు ఆర్ కృష్ణయ్య తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పార్లమెంట్‌లో బీసీ బిల్లు పెట్టి చట్టసభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. జనగణనలో కులగణన చేపట్టాలని కోరారు. 75 ఏండ్లయినా బీసీలకు విద్యా, ఉద్యోగ, ఆర్థిక, రాజకీయ రంగాల్లో అన్యాయం జరుగుతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. బీసీలకు రాజ్యాంగాబద్ధంగా న్యాయం జరడం లేదని, దేశంలోని బీసీలకు రావాల్సిన రాజ్యాంగపరమైన హక్కులను కల్పించకుండా కేంద్ర ప్రభుత్వం అణచివేస్తున్నదని ఆరోపించారు. సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, దుర్గానరేశ్, వేణుమాదవ్, సురేశ్, రాజు, మణికంఠ పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలు మళ్లీ అందజేత

'నమస్తే' కథనానికి స్పందన

బయ్యారం, ఫిబ్రవరి 7: మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండలం నామాలపాడు పంచాయతీ పరిధిలోని ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు అధికారులు మళ్లీ మంజూరు పత్రాలు అందజేశారు. ఇచ్చిన ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలను వెనక్కి తీసుకోవడంతో లబ్ధిదారుల ఆవేదనపై నమస్తే తెలంగాణలో 'ఇచ్చిన ఇందిరమ్మ ఇండ్ల పత్రాలు వెనక్కి' అనే శీర్షికతో కథనం ఈ నెల 5న ప్రచురితమైంది. దీంతో స్పందించిన అధికారులు తీసుకున్న పత్రాలను ఇంటింటికీ తిరిగి రిజిస్టర్‌లో సంతకాలు చేయించుకొని మళ్లీ లబ్ధిదారులకు అందజేశారు.

సీఎం రేవంత్‌కు నో అపాయింట్‌మెంట్!

- జార్ఖండ్ ఎమ్మెల్యేలకు రాహుల్ రెడ్‌కార్పెట్
- వారితో 2 గంటలపాటు పిచ్చాపాటి చర్చలు
- రేవంత్‌ను కలిసేందుకు ఏ మాత్రం ఇష్టపడని అగ్రనేత

జార్ఖండ్ ఎమ్మెల్యేలతో రాహుల్‌గాంధీ

హైదరాబాద్, ఫిబ్రవరి 7(నమస్తే తెలంగాణ): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ అపాయింట్‌మెంట్ ఇవ్వలేదన్న ప్రచారం హాట్ టాపిక్‌గా మారింది. రేవంత్‌రెడ్డి ఢిల్లీ పర్యటన సందర్భంగా రాహుల్‌గాంధీ అపాయింట్‌మెంట్ కోసం ప్రయత్నించినప్పటికీ, నిరాకరణ ఎదురైనట్టు ఢిల్లీలో ప్రచారం జరుగుతున్నది. అదే సమయంలో రాహుల్‌గాంధీ శుక్రవారం ఢిల్లీలో జార్ఖండ్ ఎమ్మెల్యేలతో సమావేశమయ్యారు. సుమారు 20 మంది ఎమ్మెల్యేలతో దాదాపు రెండు గంటలపాటు పిచ్చాపాటిగా చర్చలు జరిపారు. జార్ఖండ్ ఎమ్మెల్యేలకు రెడ్‌కార్పెట్ పరిచిన రాహుల్‌గాంధీ.. సీఎం రేవంత్‌ను కలిసేందుకు నిరాకరించారంటూ పెద్ద ఎత్తున చర్చ జరుగుతున్నది. రెండ్రోజులుగా ఢిల్లీలో పడిగాపులు కాచినా రాహుల్ అంగీకరించలేదనే ప్రచారం జోరుగా సాగుతున్నది.

అర్నెళ్లుగా నో అపాయింట్‌మెంట్

సీఎం రేవంత్‌రెడ్డి వ్యవహారశైలిపై రాహుల్ ఆగ్రహంతో ఉన్నట్టు ఢిల్లీ వర్గాల్లో చర్చ నడుస్తున్నది. సరైన విధానంలో పరిపాలన చేయకపోవడం, సొంత నిర్ణయాలు తీసుకోవడం, సీనియర్ నేతలను పట్టించుకోకపోవడం, వ్యక్తిగత ఎజెండా అమలుచేయడం వంటి అంశాలతో రాహుల్ అసంతృప్తిగా ఉన్నట్టు సమాచారం. దీనికితోడు సీఎం రేవంత్‌పై సీనియర్ నేతలు అధిష్ఠానానికి ఫిర్యాదులు చేసినట్టు ప్రచారం జరుగుతున్నది. వీటి కారణంగా కొద్దికాలంగా సీఎం రేవంత్‌ను రాహుల్‌గాంధీ దూరం పెడుతున్నారని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. పార్లమెంట్ ఎన్నికల సమయంలో ఎంతో అన్యోన్యంగా కనిపించిన ఈ ఇద్దరు నేతల మధ్య ఆ తర్వాత దూరం పెరిగింది. రాహుల్‌గాంధీ సుమారు అర్నెళ్లుగా రేవంత్‌రెడ్డికి అపాయింట్ ఇవ్వలేదని తెలిసింది. తాజాగా రాష్ట్రంలో చేపట్టిన కులగణన, ఎస్సీ వర్గీకరణపై అధిష్ఠానానికి వివరించి, రాష్ట్రంలో నిర్వహించే భారీ బహిరంగసభలకు ఆహ్వానిస్తామంటూ సీఎంతోపాటు మంత్రులంతా ఢిల్లీ బాట పట్టారు. రెండ్రోజుల పాటు ఢిల్లీలోనే వేసినప్పటికీ రాహుల్‌గాంధీ వీరికి అపాయింట్‌మెంట్ ఇవ్వకపోవడం చర్చనీయాంశంగా మారింది.

అర్వింద్ అనుచరుల 'ఎక్స్' ఖాతాలు రద్దు

ఎమ్మెల్సీ కవితపై అనుచిత వ్యాఖ్యల ఫలితం

ఖలీల్‌వాడి, ఫిబ్రవరి 7:ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితపై 'ఎక్స్'లో అనుచిత వ్యాఖ్యలు చేసిన బీజేపీ ఎంపీ ధర్మపురి అర్వింద్ అనుచరుల ఖాతాలను సదరు సోషల్ మీడియా సంస్థ రద్దు చేసింది. నియమ నిబంధనలు పాటించక పోవడంతో ఈ మేరకు చర్యలు చేపట్టినట్టు పేర్కొంది. కవితను రాజకీయంగా ఎదుర్కోలేని అర్వింద్ తన అనుచరులతో సోషల్ మీడియాలో అనుచిత వ్యాఖ్యలు చేయిస్తున్నారని బీఆర్ఎస్ నేతలు ఇటీవల పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలోనే ఆయా ఖాతాలను 'ఎక్స్' నిలిపివేయడంపై బీఆర్ఎస్ నేతలు హర్షం వ్యక్తంచేశారు. ఈ చర్య ఎంపీ అర్వింద్‌కు చెంపపెట్టు అని, మరోసారి ఇలాంటివి పునరావృతం కాకుండా చూసుకోవాలని హితవు పలికారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు 85 నామినేషన్లు

10న ముగియనున్న నామినేషన్ల గడువు

హైదరాబాద్, ఫిబ్రవరి 7 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలో జరుగనున్న మూడు ఎమ్మెల్సీ స్థానాలకు నామినేషన్ల ప్రక్రియ కొనసాగుతున్నది. కరీంనగర్-నిజామాబాద్-ఆదిలాబాద్-మెదక్ (పట్టభద్రులు, టీచర్స్) నియోజకవర్గాలకు, నల్లగొండ-ఖమ్మం-వరంగల్ (టీచర్స్) నియోజకవర్గానికి ఇప్పటివరకు మొత్తం 85 నామినేషన్లు దాఖలయ్యాయి. శుక్రవారం ఒక్కరోజే 56 నామినేషన్లు దాఖలైనట్లు సీఈవో సుదర్శన్‌రెడ్డి తెలిపారు. ఇందులో కరీంనగర్-నిజామాబాద్-ఆదిలాబాద్-మెదక్ (టీచర్స్) స్థానానికి 4, కరీంనగర్-నిజామాబాద్-ఆదిలాబాద్-మెదక్ (గ్రాడ్యుయేట్స్) స్థానానికి 36 నామినేషన్లు, నల్లగొండ-ఖమ్మం-వరంగల్(టీచర్స్) స్థానానికి 16 నామినేషన్లు దాఖలైనట్లు వివరించారు. ఈ నెల 10న నామినేషన్ల గడువు ముగియనున్నట్టు తెలిపారు.

ఆన్సర్ కీ చాలెంజ్ ఫీజును తగ్గించాలి: ఎస్ఎఫ్ఐ

హైదరాబాద్, ఫిబ్రవరి 7 (నమస్తే తెలంగాణ) : ప్రవేశ పరీక్షల ప్రాథమిక కీ అభ్యంతరాల ఫీజును రూ.500 నుంచి రూ.200 తగ్గించాలని స్టూడెంట్ ప్రొటెక్షన్ ఫోరం(ఎస్ఎఫ్ఐ) డిమాండ్ చేసింది. జేఈఈ, నీట్‌కు రూ.200 మాత్రమే వసూలు చేస్తుండగా, ఎప్‌సెట్ సహా ఇతర పరీక్షలకు రూ.500 వసూలు చేయడం దారుణమని ఫోరం నాయకులు రాహుల్‌నాయక్, శివకృష్ణ వాపోయారు. ఈ మేరకు శుక్రవారం ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. క్యూఆర్ కోడ్ ద్వారా సెంటర్ లోకేషన్ తెలుసుకునే వెసులుబాటు కల్పించాలని, ప్రధాన కూడళ్లలో హెల్ప్‌డెస్క్‌లు ఏర్పాటుచేయాలని కోరారు.

యూపీఎస్‌తో ఉద్యోగుల భవిష్యత్తు తాకట్టు

హైదరాబాద్, ఫిబ్రవరి 7 (నమస్తే తెలంగాణ) : యూనిఫైడ్ పెన్షన్ స్కీం (యూపీఎస్)తో ఉద్యోగుల భవిష్యత్తు కార్పొరేట్లకు తాకట్టు పెట్టినట్టేనని నేషనల్ మూవ్‌మెంట్ ఫర్ ఓల్డ్ పెన్షన్ స్కీం(ఎన్ఎంవోపీఎస్) సెక్రటరీ జనరల్ స్థితప్రజ్ఞ ఆందోళన వ్యక్తంచేశారు. ఈ స్కీమ్‌ను ఉద్యోగులంతా తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్టు తెలిపారు. యూపీఎస్‌కు వ్యతిరేకంగా శుక్రవారం బెంగళూరులోని ఫ్రీడం పార్కులో ఉపవాస సత్యాగ్రహ ధర్నా నిర్వహించారు. కార్యక్రమానికి స్థితప్రజ్ఞ సహా తెలంగాణ సీపీఎస్ఈయూ ప్రధాన కార్యదర్శి కల్వల్ శ్రీకాంత్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా స్థితప్రజ్ఞ మాట్లాడుతూ.. ఈ పథకం యూపీఎస్ ఉద్యోగుల జీవితాలను మరింత దుర్భరం చేయనున్నదని, ఈ విధానాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ స్కీమ్‌ను వ్యతిరేకిస్తూ మార్చి 2న తెలంగాణలో యుద్ధభేరి మోగించనున్నట్టు వెల్లడించారు.

పెన్షనరీ బెనిఫిట్స్ చెల్లించాలి : పెన్షనర్ల జేఏసీ

హైదరాబాద్, ఫిబ్రవరి 7 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలో రిటైర్డ్ ఉద్యోగులకు పెన్షనరీ బెనిఫిట్స్ వెంటనే చెల్లించాలని పెన్షనర్ల జేఏసీ చైర్మన్ కే లక్ష్మయ్య, సెక్రటరీ జనరల్ శుభాకర్ రావు శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. పెన్షనర్ల బెనిఫిట్స్ పెండింగ్ పెట్టడంపై వారు అసంతృప్తి వ్యక్తంచేశారు. మార్చి, 2024 తర్వాత రిటైర్డ్ అయిన వారికి వెంటనే పెన్షన్ ప్రయోజనాలు చెల్లించాలని వారు కోరారు.

ఆర్టీసీ కార్మికులకు సర్కారు పిలుపు

సమ్మె నోటీసుపై స్పందించిన ప్రభుత్వం

హైదరాబాద్, ఫిబ్రవరి 7 (నమస్తే తెలంగాణ): సమస్యల పరిష్కారం డిమాండ్‌తో ఆర్టీసీ కార్మిక జేఏసీ ఇచ్చిన సమ్మె నోటీసుతో ప్రభుత్వం దిగివచ్చింది. ఈ నెల 10న చర్చలకు రావాలని కార్మిక జేఏసీ నేతలను, ఆర్టీసీ యాజమాన్య అధికారులను కార్మికశాఖ ఆహ్వానించింది. కార్మిక నేతలు 21 డిమాండ్లతో జనవరి 27న యాజమాన్యానికి సమ్మె నోటీసు ఇచ్చారు. ప్రభుత్వం స్పందించకపోతే ఫిబ్రవరి 9 నుంచి విధులు బహిష్కరిస్తామని హెచ్చరించారు. కానీ ప్రభుత్వం ఫిబ్రవరి 10న చర్చలకు పిలిచింది. గడువు తర్వాతి రోజు చర్చలకు పిలవమేంటని యూనియన్ల నేతలు మండిపడుతున్నారు.

బస్‌డిపోలను ప్రైవేటీకరించం : సజ్జనార్

హైదరాబాద్, ఫిబ్రవరి 7 (నమస్తే తెలంగాణ): ఎలక్ట్రిక్ బస్సుల విషయంలో కొందరు ఉద్దేశపూర్వకంగానే దుష్ప్రచారం చేస్తున్నారని, డిపోల ప్రైవేటీకరణ జరుగొచ్చని తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆర్టీసీ ఎండీ సజ్జనార్ వెల్లడించారు. ఈ ప్రచారాన్ని నమ్మవద్దని సూచించారు. ఎలక్ట్రిక్ బస్సుల రాకతో ఒక్క ఉద్యోగిని కూడా తొలగించబోమని చెప్పారు. శుక్రవారం సంస్థ క్షేత్రస్థాయి ఉద్యోగులు, అధికారులతో సజ్జనార్ వీడియోకాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. 'కేంద్ర ప్రభుత్వ ఈవీ పాలసీ ప్రకారమే గ్రాస్ కాస్ట్ కాంట్రాక్ట్(జీసీసీ) పద్ధతిలో ఎలక్ట్రిక్ బస్సులను సంస్థ సమకూర్చుకుంటున్నది. వీటితో సహా అన్ని బస్సుల నిర్వహణ ఆర్టీసీ ఆధ్వర్యంలోనే జరుగుతుంది' అని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల 3,038 ఉద్యోగాల భర్తీకి అనుమతి ఇచ్చిందని, వాటి నియామక ప్రక్రియ కొనసాగుతున్నదని సజ్జనార్ తెలిపారు.

తెలంగాణలో జనసేన పార్టీకి ఈసీ గుర్తింపు

హైదరాబాద్, ఫిబ్రవరి 7 (నమస్తే తెలంగాణ): జనసేన పార్టీకి తెలంగాణలో గుర్తింపు దక్కింది. త్వరలో జరుగనున్న స్థానిక ఎన్నికల్లో పోటీకి ఆ పార్టీకి గాజుగ్లాసు గుర్తును రాష్ట్ర ఎన్నికల సంఘం కేటాయించింది. ఈ మేరకు సంఘం కార్యదర్శి అశోక్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు.

ఎవరి కుంపటి వాళ్లదే!

- కాంగ్రెస్ అధిష్ఠానానికి ఎవరి లిస్టువాళ్లు అందజేసిన రాష్ట్ర అగ్రనేతలు
- అధిష్ఠానం దూతతో విడివిడిగా భేటీ
- పీసీసీ కూర్పు మీదనే ప్రధాన కసరత్తు
- ఏకంగా నలుగురు కార్యనిర్వాహక అధ్యక్షులను ఎంపిక చేసే అవకాశం

హైదరాబాద్, ఫిబ్రవరి 7(నమస్తే తెలంగాణ): పార్టీ కోసం జెండామోసిన కార్యకర్తలను వదిలేసి, వ్యక్తి ప్రాధాన్యంగా విధేయత ప్రకటించిన వారికే పీసీసీలో పెద్దపీట వేసేందుకు రంగం సిద్ధమైంది. తమ అనుచరులు, భజనపరులను పీసీసీ కార్యవర్గంలో నింపడానికి రాష్ట్ర అగ్రనేతలు పోటీపడుతున్నారు. రాష్ట్రం నుంచి ఢిల్లీ వెళ్లిన నలుగురు కాంగ్రెస్ నేతలు ఎవరికి వారుగా తమ అనుచర వర్గం పేర్లతో పీసీసీ కార్యవర్గం లిస్టు తయారుచేసుకొని అధిష్ఠానానికి సమర్పించినట్టు తెలిసింది. పీసీసీ కార్యవర్గం కూర్పుపై తెలంగాణ అగ్రనేతలతో ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ సుదీర్ఘ చర్చలు జరిపారు. శుక్రవారం ఆయన ఢిల్లీలో రాష్ట్రానికి చెందిన ముఖ్య నేతలతో విడివిడిగా సమావేశమయ్యారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో చర్చలు జరిపి, వారి అభిప్రాయాలను తీసుకున్నట్టు తెలిసింది.

అధిష్ఠానం దూత అసంతృప్తి!

పీసీసీలో అన్ని సామాజిక వర్గాల సమతుల్యత ఉండాలని, ప్రధానమైన సామాజికవర్గాల వారికి 'లేదు అనకుండా' ప్రాతినిధ్యం కల్పించాలని ఢిల్లీ అధిష్ఠానం దిశానిర్దేశం చేసినట్టు తెలిసింది. ప్రధానంగా, పార్టీ కోసం పని చేసిన కార్యకర్తలు, త్యాగాలు చేసిన నేతలను గుర్తించి వారికి మాత్రమే పీసీసీలో స్థానం కల్పించాలని, అగ్రనేతలంతా కూర్చొని అర్హులైన అభ్యర్థుల పేర్లతో లిస్టు తయారుచేసుకొని ఢిల్లీకి రావాలని కాంగ్రెస్ అధిష్ఠానం సూచించినట్టు తెలిసింది. అయితే, రాష్ట్ర పార్టీకి చెందిన అగ్రనేతలు మాత్రం ఎవరికి వారుగా తమ అనుచరుల లిస్టును తయారుచేసుకొని ఢిల్లీ వెళ్లినట్టు సమాచారం. జాబితా తయారీలో ఏ ఒక్కరూ కూడా పార్టీ కోసం పనిచేసిన కార్యకర్తలను పట్టించుకోలేదని తెలుస్తున్నది. ముఖ్య నేత, రాష్ట్ర పార్టీ పెద్ద నేత ఇద్దరూ కలిసి వలస నేతలతో లిస్టు తయారుచేసినట్టు, మరో ఇద్దరు సీనియర్ నాయకులు పూర్తిగా తమ అనుచర బలగాల పేర్లతోనే లిస్టు తయారుచేసుకొని ఇచ్చినట్టు తెలిసింది. ఆయా జాబితాలపై అధిష్ఠానం దూత అసంతృప్తి వ్యక్తంచేసినట్టు సమాచారం.

జంబో కమిటీ దిశగా..

కాగా తమ వర్గం వారికి అవకాశం ఇవ్వాలని నలుగురు నేతలూ పట్టుబట్టినట్టు తెలుస్తున్నది. దీంతో మధ్యే మార్గంగా కమిటీలోకి నలుగురు కార్యనిర్వాహక అధ్యక్షులను తీసుకోవాలని, దళిత, ముస్లిం, గిరిజన, రెడ్డి సామాజిక వర్గాల నుంచి ఒక్కొక్కరి చొప్పున అవకాశం కల్పించాలని ప్రాథమికంగా అనుకున్నట్టు తెలిసింది. పార్టీ ఉపాధ్యక్షులుగా మరింత ఎక్కువమందికి అవకాశం కల్పించాలని, పదవులు కోరుకునే వాళ్లందరికీ ఉపాధ్యక్ష పదవి కట్టబెట్టాలని నిర్ణయించినట్టు తెలిసింది. డిమాండ్‌ను బట్టి 15 నుంచి 20 వరకు ఉపాధ్యక్షులను నియమించాలని నిర్ణయించినట్టు సమాచారం. ఇందుకోసం అవసరమైతే జంబో కమిటీగా విస్తరించాలని కాంగ్రెస్ అధిష్ఠానం నిర్ణయించినట్టు తెలిసింది. అదేవిధంగా పార్టీ అనుబంధ సంఘాల అధ్యక్షులు, జిల్లా అధ్యక్షులను కూడా నియమించాలని నిర్ణయించినట్టు సమాచారం. అనుకున్నది అనుకున్నట్టుగా సాగితే ఒకటి లేదా రెండో రోజుల్లోనే పీసీసీ కార్యవర్గాన్ని ప్రకటించాలని నిర్ణయించినట్టు తెలిసింది.

'కోడ్' సాకు..ఆత్మీయ భరోసాకు బ్రేక్

- ప్రారంభించిన ఫస్ట్ రోజు మాత్రమే 18,180 మంది ఖాతాల్లో నగదు
- ఎమ్మెల్సీ ఎన్నికల నియమావళిని అడ్డుగా చూపి తెల్లారి నుంచి నిలిపివేత
- ఎన్నికలు వర్తించని గ్రామాల్లోనూ ఇదే తీరు
- గ్రామసభల్లో కొత్తగా 2,24,487 దరఖాస్తులు
- ఇందులో కేవలం 20 వేల మందే అర్హులు

హైదరాబాద్, ఫిబ్రవరి 7(నమస్తేతెలంగాణ): రైతు కూలీల ఖాతాల్లో జనవరి 26 నుంచి ఆత్మీయ భరోసా కింద రూ. 6వేల చొప్పున జమ చేస్తామని చెప్పిన ప్రభుత్వం అమల్లో మాత్రం తీవ్ర జాప్యాన్ని చూపిస్తున్నది. పైలట్ ప్రాజెక్ట్ కింద ఎంపిక చేసిన గ్రామాల్లోని 18,180 మంది లబ్ధిదారులకు పథకం ప్రారంభించిన తొలిరోజు ఆర్థిక సాయం అందజేసింది. అయితే తెల్లారే ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ రావడంతో దీనిని సాకుగా చూపి పథకాన్ని రాష్ట్ర వ్యాప్తంగా నిలిపివేసింది. ఎన్నికల నియామవళి వర్తించని గ్రామాల్లోనూ నగదు జమ చేయకపోవడంతో లబ్ధిదారుల్లో అసహనం వ్యక్తమవుతున్నది.

6.5 లక్షల మందికి మాత్రమే వర్తింపు..

ఆత్మీయ భరోసా పథకానికి సుమారు 5.80 లక్షల మంది అర్హులున్నట్లు గుర్తించి జాబితాలు విడుదల చేసింది. లిస్ట్‌లో పేర్లులేని అర్హుల కోసం గ్రామసభలు ఏర్పాటు చేసి దరఖాస్తులు స్వీకరించగా, 2.24 లక్షల మంది అర్జీలు పెట్టుకున్నారు. ఇందులో కేవలం 19,193 దరఖాస్తుదారులను మాత్రమే అర్హులుగా గుర్తించి, 1,44,784 దరఖాస్తులను తిరస్కరించారు. 59,542 దరఖాస్తులను పెండింగ్‌లో పెట్టారు. ఇందులో సుమారు ఆరు వేల మందిని ఎంపిక చేయనున్నారు. అంటే మొత్తంగా 5.80 లక్షల మందితోపాటు అదనంగా 20 వేల నుంచి 25 వేల మందికి అంటే దాదాపు 6.5 లక్షల మందికి ఆత్మీయ భరోసాను వర్తింపజేయనున్నారు.

రైతు భరోసాకు లేని నిబంధనలు.. ఆత్మీయ భరోసాకెందుకు.?

ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ నేపథ్యంలో మొదట రెండు, మూడు రోజులు రైతు భరోసాను నిలిపివేసింది. అయితే కొనసాగుతున్న పథకాలకు కోడ్ అడ్డంకి కాదని ఎలక్షన్ కమిషన్ వర్గాలు వెల్లడించాయి. దీంతో రైతు భరోసాను యథావిధిగా అమలు చేస్తున్నారు. కానీ ఆత్మీయ భరోసాను మాత్రం నిలిపివేశారు. దీంతో రైతు భరోసాకు లేని ఎన్నికల నిబంధనలు ఈ పథకానికి ఎందుకు వర్తిస్తాయని రైతులు ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధిలేకనే ఈ పథకాన్ని నిలిపివేసిందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వెంటనే అర్హులందరి ఖాతాల్లో రూ. 6వేల చొప్పున జమ చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

విస్తరణ లేనట్టే!

మొదటిపేజీ తరువాయి...

శాశ్వత పరిష్కారం లభించిందని చెప్పారు. పీసీసీ కార్యవర్గ ఏర్పాటుపై రెండు రోజుల్లో ప్రకటన ఉంటుందని పేర్కొన్నారు.

రాహుల్ అపాయింట్‌మెంట్‌ను కోరలేదు

ఢిల్లీ